# అయ్యబాబోయ్ ఆడది

## డాక్టర్ భమిడిపాటి శకుంతలాదేవి

"ఛీ! ఛీ! లోకం చెడిపోయింది పూర్తిగా ఆడదని గౌరవంలేదూ, భక్తీ లేదూ" విసురుగా వచ్చి కుర్చీలో కూర్చున్నాడు మధు.

పెన్సిలిన్ లోడ్ చేస్తున్న అపర్ణ కిలకిలా నవ్వింది. "ఎవర్ని మధుబాబూ! ఉదయాన్నే దీవిస్తున్నారు" అంది నవ్వుతూ.

"నాతో మాట్లాడకు. నాకసలే విసుగ్గావుంది" అంటూ అక్కడనుంచి లేచివెళ్ళి యింకో కుర్చీలో కూర్చున్నాడు.

"ఏమిటి అపర్ణా! మనవాడు అంత హాటు హాటుగా ఉన్నాడు. మీరేమయినా అన్నారేమిటి?" బి. డి. ఏపరేటస్ కోసం వెతుకుతున్న కృష్ణ ప్రశ్నించేడు.

"నేను అనేందుకు అవకాశం యిస్తానా! వస్తూనే నా మీద విసుక్కున్నారు. అంత విసురుగా మాట్లాడితే నాకేమవుసరం. మాట్లాడేవరకూ" అపర్ణ ఎర్రబడిన ముఖంతో సిరెంజ్ పట్టుకొని దూరంగా వెళ్ళిపోయింది.

"చచ్చాంరా బాబూ! ఈ రోజు వార్డు పనంతా నా దన్నమాట. ఇద్దరూ పోట్లాడుకొని నా నెత్తిన పడేస్తారు. అయినా ఏం జరిగింది మధూ! ఇంట్లో ఎవరైనా ఏమైనా అన్నారా?" అనునయంగా అడిగేడు కృష్ణ.

"అదేం లేదురా! బిందు నేనూ బస్సు దిగుతున్నాం. ఎవడో వెనకనించి జడ లాగేడట. అది ఒకటే ఏడుపు. ఎవడో ఫూల్ బుద్ధిలేకుండా ప్రవర్తిస్తే నువ్వెందుకు ఏడవడం?' అని ఎంత చెప్పినా వినదే! 'నీకు తెలీదన్నయ్యా! ఆడపిల్లకి అవమానం జరిగితే ఎలా వుంటుందో. నేను హాస్పిటల్‌కి రాను. ఇంటికి వెళ్ళిపోతాను, నేను చూపించుకోను' అంటూ రిక్షాలో వెళ్ళిపోయింది ఏడుస్తూ—దానికి మంకుపట్టు చిన్నప్పటి నుంచి ఏం అనలేక యిలా వచ్చేసాను. జనాలకసలు రోజురోజుకి మతిపోతుంది

జన్మ యిచ్చిన అమ్మ ఆడదన్నసంగతి గుర్తుంచదెందుకో. ఆడదంటే అలుసు. గౌరవంలేదూ, పాడూలేదూ" అన్నాడు మధు కోపంగా.

"ఆడదంటే జనాలకిగౌరవంలేదంటే నేనొప్పుకోను. చాలా మర్యాదాయిస్తారు ఆమె కెవరైనా హాని తలపెడుతున్నారంటె అందరి మనసులు కొట్టుకుపోతాయి. నాకు తెలుసు ఆడదానికి యీ దేశంలో ప్రజలిచ్చిన గౌరవమర్యాదలు ఏ దేశప్రజలూ యివ్వరు" అందిఅపర్ణ సిరెంజ్ బేసిన్‌లో పడేస్తూ.

"నువ్వు నోరుమూసుకో. నేను ఏదంటే దానికి వ్యతిరేకంగా మాట్లాడకపోతే నీకు తోచదు. పుస్తకంలో ఉన్న సబ్జక్టు గురించే తెగ వాదిస్తావు. ఇక యిదో లెక్కా? నీకు." అన్నాడు మధు.

"అబ్బబ్బ! మీరు ఒక్కరోజయినా పోట్లాడకుండా వున్నారా? నెమ్మదిగా మాట్లాడుకోకూడదా పోనీ! ఒకరితో ఒకరికి పడకపోతే మాట్లాడుకోవడం మానేయండికానిపోట్లాడుకోకండిబాబూ! వార్డులోఅసహ్యంగాఉంటుంది' అన్నాడు కృష్ణ.

"పోనీ నేను వాదిస్తానంటారు. కాని అందులో నిజం ఉందని ఒప్పుకోరెందుకని. ఆడదంటే జనాలకి విపరీతమైన గౌరవమని ఋజువు చెయ్యనా!" అంది అపర్ణ.

"సరే! ఈసారి పందెం వెయ్యాలి. నేను ఓడిపోతే యిక ఈ జన్మలో నీతో వాదించను. నువ్వు కుక్కని నక్కఅన్నా కాదనకుండా ఒప్పేసుకుంటాను. మరి నువ్వు" అన్నాడు మధు.

"నేను ఓడిపోతే యిదిగో — నేను ఎంతో ప్రాణప్రదంగా చూసుకునే యీ రింగ్ యిచ్చేస్తాను. నేను ఫైనలియర్ పాసయినందుకు మా ఫాదర్ ప్రెజెంట్ చేసేరు. మీరేసాక్ష్యం కృష్ణా!" అంది అపర్ణ ఉంగరంతీసి అతనిచేతిలో పెడుతూ.

"సరే! మీరీ రోజు యిక పోట్లాడుకోవడం మానేసి వార్డులో పనిచేయండి. అంతపని నేనొక్కడినే చేసుకోలేను" అంటున్న కృష్ణమాటలకు అపర్ణ. మధు నవ్వేసేరు.

"అబ్బ! బుర్ర వేడెక్కిపోయింది. ఈ వెధవ ఆలోచనల్తో. కేంటిన్‌లో కాఫీ త్రాగేసి వచ్చి యింజెక్షన్సు యిచ్చేద్దాం. ఈ రోజు ఆదివారమేగా. ఛీఫ్ రారు" అన్నాడు మధు.

కాఫీ త్రాగుతున్న అపర్ణ "మధుబాబూ! మీకు ఒక ఎర్రచారల షర్టు ఉండేది కదూ!" అంది ఆరా తీస్తున్నట్టు.

"అది వేసుకోకండి బాబూ! అచ్చు రౌడీలా వుంటారు అన్నావుగా. అప్పటి నుంచి వేసుకోవడమే లేదు" అన్నాడు మధు కాఫీ కప్పు క్రింద పెట్టి.

"పెద్ద నా మాట మీద నడుస్తున్నట్టు. రేపు మీరు అది వేసుకొని రండి" అంది నవ్వుతూ.

"ఏం! పార్టీ ఏమైనా యిస్తున్నావా! ఫొటో తీయించుకుందామా! యీ ఆడవాళ్ళ బుర్రల్లో అప్పటికప్పుడు మెరుపులాంటి ఐడియాస్ వచ్చేస్తాయిరా కృష్ణా!" అన్నాడు మధు నవ్వుతూ.

"పార్టీనో, ఫొటోనో రేపు చెప్తాను కాని. మీరు రేపు - 'మరిచి పోయాను అపర్ణా!' అని అంటె ఊరుకోను" అంది కుర్చీలోంచి లేస్తూ

లోకాభిరామాయణం మాట్లాడు కుంటూ వార్డులో పని పూర్తిచేసేసారు ముగ్గురూ.

"వస్తాను కృష్ణా! ఈ రోజు మధ్యాహ్నం పిక్చర్ ప్రోగ్రాం ఉంది, బి.డి. యింజెక్షన్స్ మీ యిద్దరిలో ఎవరో ఒకరు యిచ్చేయండి. సాయంత్రం నేను రాను మధు బాబూ! రేపు చారల షర్టు వేసుకోవడం మరచి పోకండి" మాట్లాడుతూనే వెళ్ళిపోయింది అపర్ణ.

* * *

అప్పుడే వార్డులో అడుగు పెట్టిన అపర్ణ కిలకిలా నవ్వింది. కేస్‌షీట్ వ్రాసుకుంటున్న మధు ఉలికి పడ్డాడు.

"అబ్బ! తమరా! ఎవరో అనుకున్నాను! ఎందుకా నవ్వు రావడమే లేదు! సిగ్గులేకుండా నవ్వడం ఎందుకేమిటి?"

"అది కాదు మధు బాబూ! మీరు అచ్చు రౌడీ పిల్లాడిలా ఉంటేనూ.... సరే! కాని యీ రోజు పోస్టాఫీసుకి వెళ్ళామను కున్నాం కదూ, ఛీఫ్ వచ్చి వెళ్ళి పోయాక వెళ్దామా?" మురిపెంగా అడిగింది.

"వెళ్దాం కాని ముందు వార్డులో పని పూర్తి చేయండి అసిస్టెంటు.... వస్తే చీవాట్లు తప్పవు" అంటూ కేస్‌షట్ వ్రాయడంలో మునిగి పోయాడు.

"ప్లూరల్ ఎఫ్యూషన్ కేస్ అలా ఉంచండి. ఎగ్జామ్‌కి పెడదాం టేప్ చెయ్యకండి సుమా!" అన్నారు ఛీఫ్,

"ఎగ్జామ్‌కి పెట్టాలనుకున్న కేసులన్నీ నోట్ చేసుకున్నారు మధు, కృష్ణ.

"కేసెస్ టేప్ యివ్వడం దండగ మధు బాబూ! కేస్ ఎలాగూ తెలుస్తూనే ఉంటుంది. డిస్కషన్ చెయ్యగలగాలి" అంది అపర్ణ.

"తల్లీ! యీ కేసెస్ మీ కోసం కాదు. మీకు ఛీఫ్‌కే పాఠాలు చెప్తారు. మాబోటి మొద్దురా చిప్పలు ఉంటారు చూడండి. ట్రిప్పు వస్తే బాగుండునని. అటువంటి వాళ్ళ కోసం" అన్నాడు మధు ఎగతాళిగా.

"అన్నట్టు మీ రిద్దరూ! పోస్టాఫీస్‌కి వెళ్తామన్నారు. తొందరగా వెళ్ళి వచ్చేయండి" అన్నాడు కృష్ణ. వాళ్ళిద్దర్ని అలా మాట్లాడు కోనిస్తే చిలికి చిలికి గాలి వాన అవుతుందని.

"ఔను సుమా !" అంటూ అపర్ణ లేచింది. మధు కూడా అపర్ణ వెనకే నడిచేడు.

"భలే ! హౌస్ సర్జన్సు. అంతలోనే పోట్లాడు కుంటారు. అంతలోనే నవ్వేసు కుంటారు. ఇంత మందిని చూసేను. కాని మీ ముగ్గురి కాంబినేషన్ ఎక్కడా చూడలేను." అంది స్టాఫ్ నవ్వుతూ.

కృష్ణ కూడా నవ్వేసేడు. స్నేహం అంత మధురమైనది యీ ప్రపంచంలో మరేమీ లేదండీ" అంటూ.

అతి నెమ్మదిగా నడిచే అపర్ణ తన కంటే నాలుగడుగులు ముందు నడు స్తుంటే మధు ఆశ్చర్యపోయేడు.

నాలుగురోడ్ల కూడలి దగ్గరకి వచ్చేక అపర్ణ "అయ్యబాబోయ్ !" అంటూ కెవ్వున అరిచింది.

"ఏమయింది అపర్ణా !" అంటూ మధు కంగారుగా అపర్ణ చెయ్యి పట్టు కున్నాడు.

నలుగురూ వారిద్దరిచుట్టూ మూగడం చూసిన అపర్ణ కన్నీళ్ళతో "చూడండి. ఈ పెద్దమనిషి నన్ను ఎప్పటినుంచో వెంటాడుతున్నాడు. ఈరోజు ఒక్కర్తినీ ఉండటంచూసి చెయ్యి పట్టుకున్నాడు" అంది.

"అపర్ణా !...." అన్నాడు మధు తెల్లబోతూ.

"నీకేం పోయేకాలమయ్యా ! ఆడ కూతురిని ఏడిపిస్తావా ? చదువుకున్న వాడిలా వున్నావు" అంటూ ఒకతను షర్టుకాలర్ పట్టుకున్నాడు.

"వెధవ రౌడీవేషం చూస్తే తెలు స్తూనేవుంది. నీకు ఇంట్లో చెల్లెళ్ళు లేరటయ్యా ! అమ్మాయి కావాలంటె లక్షణంగా పెళ్ళిచేసుకో. అంతేకాని ఇలా వీధినపోయే అమ్మాయిల్ని అవమా నిస్తావా !" అందరూ తలొకమాట అంటూ ఎడపెడా కొట్టడం మొదలు పెట్టారు.

అపర్ణకి ఈ సారి నిజంగానే ఏడుపు వచ్చింది.

"కొట్టకండి. మీకు నమస్కారం పెడతాను. అతన్ని వదిలివేయండి" అంతమందినీ తప్పించుకొని మధ్యన నిలబడి చేతులు జోడించి అంది.

"ఆ ఆడకూతురు ఊరుకో మందని ఊరుకున్నాం. లేకపోతే రక్తం కళ్ళ చూద్దుం. ఏమనుకుంటున్నావో. ఆడ దంటే" అంటూ అందరూ వెళ్ళి పోయారు.

"మధుబాబూ ! నన్ను క్షమించండి" అంది అపర్ణ కన్నీళ్ళతో. మధు ఏమీ మాట్లాడకుండా వార్డువైపు నడిచేడు.

"క్షమించండి. మధుబాబూ! నా వల్ల పొరపాటే" అంటూ అతని వెనుకే నడిచింది అపర్ణ.

"అదేమిట్రా మధూ ! ఆ దెబ్బ లేమిటి ?" అన్నాడు కృష్ణ తెల్లబోతూ.

"అదంతా నా వల్లే జరిగింది కృష్ణా !



ఆడదంటే మగవాళ్ళకి ఎంత గౌరవమో చూపిస్తానని నిన్న పందెం వేసేనుకదా! అందుకని .." యిక మరి మాట్లాడలేక పోయింది. కన్నీళ్ళు ధారావాహకంగా కారుతున్నాయి.

"ఫ్రెండ్స్‌తో ప్రాక్టికల్ జోక్స్ మంచిదికాదు అపర్ణా! కృష్ణ నొచ్చుకుంటూ ఫస్ట్‌ఎయిడ్ చేసేడు.

"మధుబాబూ! మీ యిష్టంవచ్చిన శిక్ష విధించండి. అలా మాట్లాడకుండా శిక్షించకండి" అంది అపర్ణ మధు చేతులుపట్టుకొని.

మధు చిన్నగా నవ్వేడు. "ఇందులో నీ తప్పేముంది అపర్ణా. ఇలా అవుతుందని నువ్వు మాత్రం అనుకున్నావా? నువ్వే పందెం గెలుచుకున్నావు. ఇక నువ్వు ఔనన్నది ఏనాడూ కాదనను. అయ్యబాబోయ్! ఆడది తలుచుకుంటే ఏమైనా చెయ్యగలదు" అన్నాడు మధు

కన్నీటిని తుడుచుకుంటూ అపర్ణ కూడా నవ్వింది చిన్నగా.

"మరెప్పుడూ యిలా ప్రాక్టికల్ జోక్స్ వెయ్యకండి అపర్ణా!" అంటూ క్రికంరోజు తనకిచ్చిన రింగ్ ఆమె చేతిలో ఉంచేడు కృష్ణ.

"ఒక్కటి మాత్రం నిజం మధుబాబూ! ఏ కాలంలోనూ స్త్రీకి గౌరవ మర్యాదలు తగ్గవు. తలమానికగానే ఉంటుంది, కాకపోతే వయస్సుచేసే గమ్మత్తులకి లొంగిపోయి, ఎవరో అడపాతడపా పిచ్చివేషాలు వేస్తారు. అటువంటివి మనం పట్టించుకోకూడదు" అంది అపర్ణ.

"నిజమే. ప్రాక్టికల్ జోక్స్ వేసినా వమ్మనా! పదండి అలా వెళ్ళి కాఫీ త్రాగుదాం" అంటూ కుర్చీలోంచి లేచేడు మధు.